క్లుప్తంగా

ఘనంగా మహాభారత ఉత్సవాలు


అలంకరణలో అర్జున, ద్రౌపది అమ్మవారు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ఆదివారం ద్రౌపది, అర్జున అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక పూలలలో అలంకరించారు. గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

చంద్రవంకపై చెల్లియమ్మ


చంద్రవంకపై ధనలక్ష్మిగా చెల్లియమ్మ

నగరి: మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో ఆడినెల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామదేవత చెల్లియమ్మను ధనలక్ష్మి రూపంలో అలంకరించి మల్లెపూలతో సిద్ధం చేసిన చంద్రవంకపై ఉంచారు. అత్యద్భుతంగా ఉన్న అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఏర్పాట్లను నిర్వాహకుడు ఎల్లప్పరెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ


భజనలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీ గ్రామంలో ఆదివారం అయ్యప్ప స్వామి భక్తులు, మణిగంత స్వామి పడి పూజలు చేశారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వామికి మాలలు ధరించిన భక్తులు స్వామివారి ఆలయానికి చేరుకుని స్వామి చిత్రపటాన్ని పుష్పపల్లకిలో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి మణిగంతస్వామికి మాలవేసి ఇరుముడి కట్టారు. రాత్రి పడిపూజ చేపట్టారు. అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు పాటలు పాడుతూ ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు.

బెదరింపులకు బెదరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం బెదరింపులకు బెదరమని, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ పచ్చ పార్టీ స్కెచ్ అని జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు సంపత్, సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలం తాళంబేడులోని శ్రీధర్మరాజుల ఆలయంలో ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్య ప్రజలను భయపెడుతోందన్నారు. రెడ్‌బుక్ పేరుతో తప్పుడు కేసులు పెడుతోందన్నారు. ఈ బెదిరింపులకు వైఎస్ఆర్ సీపీ ఎప్పటికీ బెదరదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు వేదికలు

- నిర్వహణ పట్టించుకోని స్థల యజమానులు
- దోమలు, పాములు, పందులకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు
- ఇబ్బందుల్లో స్థానికులు


నివాసాల మధ్యలో పిచ్చిమొక్కల్లో సంచరిస్తున్న పందులు


ఆనం లలితా లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నగరి: మున్సిపల్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో నివాసాల పక్కనే ఉన్న ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయి దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఆనం లలితా లేవుట్‌తోపాటు దానికి సమీపంగా ఉన్న పలు ప్రాంతాల్లో కొందరు ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగి పోయి వర్షపునీరు, మురుగు నీరు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు విషజ్వరాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని యజమానులు

స్థలాల యజమానులు అధిక ధరలు వస్తే లాభానికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అంత వరకు స్థలాలను ఖాళీగా వదిలేస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలని చుట్టుపక్కల వారు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఇరుగుపొరుగు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లడంతోపాటు సాయంత్రం దోమల బెడద ఎక్కువవుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను మట్టి వేసి ఎత్తు చేసేలా యజమానులకు సూచించాలని, పిచ్చి మొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఖాళీస్థలాల సమీపం నివాసాలు ఏర్పరుచుకున్నవారు కోరుతున్నారు.


ఓంశక్తి వీధిలో ఖాళీగా ఉన్న స్థలంలో పిచ్చిమొక్కలు

తీవ్ర దుర్వాసన వస్తోంది

ఇంటి ఎదురుగా ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వర్షపు నీరు చేరి దోమల నిలయంగా మారింది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పశువులు, పందులు, దోమలు స్వైర విహారం చేయడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. దీనికి తోడు మా నివాసాలు ఉన్న వీధిలో మురుగు కాలువ లేదు. మురుగు నీటిని ఖాళీ స్థలాల్లో వదిలేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో నివాసాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమల బెడద ఎక్కువైంది. కాలువలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించాం. ఇప్పటి వరకు కాలువలు ఏర్పాటు చేయలేదు.

–ఏకాంబరం, ఆనం లలితా లేఅవుట్, నగరి

చర్యలు చేపడుతాం



ఖాళీ స్థలాల యజమానులను ఇప్పటికే పలు మార్లు హెచ్చరించాం. ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు జారీచేశాం. అలాగే నివాసాల సమీపం స్థలాలను ఖాళీగా వదిలేసినవారు వాటిని ఎత్తు చేయాలని, పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తాం. కాలువల నిర్మాణానికి త్వరలో చర్యలు తీసుకుంటాం.

–కృష్ణారెడ్డి, కమిషనర్, నగరి మున్సిపాలిటీ

హుండీ ఆదాయం రూ.3.77 లక్షలు


హుండీ లెక్కింపు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి హుండీ ద్వారా రూ.3లక్షల 77వేల 624 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీ లెక్కింపుని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆడికృత్తిక సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ ద్వారా రూ.2లక్షల 77 వేల 624 వచ్చిందని, అలాగే శాశ్వత హుండీ ద్వారా రూ.99 వేల 638 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం ఖజానాకు జమ చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవియాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం


మహాకుంబాభిషేకంలో ప్రత్యేక హోమాలు


ఊరేగింపులో శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామివారు

గంగాధరనెల్లూరు: మండలంలోని తిరువీధి కుప్పం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా ఆలయ సంప్రోక్షణ, మహా కుంభాభిషేక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరువీధి కుప్పం గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం మహాగణపతి హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, యజ్ఞాది హోమాలు నిర్వహించగా, ఆదివారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేక, అలంకరణలు విశేష పూజలు నిర్వహించి, ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమం, మహా కుంభాభిషేక కార్యక్రమం వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. విచ్చేసిన భక్తాదులందరికీ తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుండి వందలాదిమంది భక్తులు హాజరయ్యారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు



రోగులకు పండ్లు, బ్రెడ్ అందిస్తున్న జర్నలిస్టులు, ఎస్ఐ సుమన్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గం స్థాయిలో మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో 68వ ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుమల మాట్లాడుతూ జర్నలిస్టులు అందరూ ఐకమత్యంతో తమ హక్కులను సాధన కోసం పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు వెంటనే మంజూరు చేయాలను డిమాండ్ చేశారు. అలాగే 3 సెంట్లు ఇంటి స్థలంతోపాటు, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. అనంతరం కేక్ చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం రోజు జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు అందుకున్న ఎస్ఐ సుమన్‌ను అభినందించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, వెంకటేష్, నియోజవర్గం ప్రధాన కార్యదర్శి రోహిత్, సంయుక్త కార్యదర్శి రాజయ్య, కోశాధికారి నరేష్, కార్యవర్గ సభ్యులు మహేంద్ర, సతీష్, పరంధామయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ

ఐరాల: మండలంలోని మద్దిపట్లపల్లెలో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతోపాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి మట్టి ప్రతిమ చూపరులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారులు యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. అదేవిధంగా దుర్యోధునుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అనంతరం భీముని వేషధారి దుర్యోధనుడిని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. జనంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

కోలాహలంగా ఉట్లోత్సవం


ఉట్టి కొడుతున్న యాదవ కులస్తులు


గ్రామవీధుల్లో విహరిస్తున్న శ్రీవేణుగోపాలుడు

- భక్తిశ్రద్ధలతో గోపూజ

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జనం మధ్య అత్యంత వైభవంగా సాగిన ఉట్లోత్సవం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తదుపరి పంచాంగ శ్రవణం చేపట్టి భక్తులకు సర్వ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతోపాటు స్వామివారిని పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే యాదవ కులస్తులతో ఉట్లోత్సవాన్ని నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్తులు, కార్వేటినగరం నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

వేణుగోపాలుని ఊరేగింపు

ఉట్లోత్సవం సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు ఆదివారం గ్రామ వీధుల్లో మేళ, తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, శుద్ధి, తోమాల, అర్చన, పంచాంగ శ్రవణం, నిత్య కైంకర్యాలు చేపట్టారు. అదే విధంగా టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమంలో భాగంగా వేద పండితులు వేద మంత్రాలతో పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉభయనాంచారులతోపాటు శ్రీవేణుగోపాలుడిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. ఈ క్రమంలో భాగంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేద పండితులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు పవిత్రోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం మృత్సంగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం, అంకురార్పణ, యాగశాల, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే బుధవారం ఉత్సవమూర్తులకు తిరుమంజనం, పవిత్ర సమర్పణ, తిరువీధి ఉత్సవం, యాగశాల, పూర్ణాహుతి, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు చేపడుతామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

వేడుకగా కల్యాణోత్సవం

- పురవీధుల్లో ఊరేగిన శ్రీసుబ్రమణ్య స్వామివారు
- తెప్పపై విహారం


తెప్పపై వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


అన్నదానం

కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు ఆదివారం స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు శనివారం గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవార్లతో పాటు శ్రీసుబ్రమణ్య స్వామివారిని ప్రత్యేక వాహనంపై కొలువు దీర్చి గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు.

వేడుకగా సారె సమర్పణ

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చాకలివాని గుంట ఎస్టీకాలనీకి చెందిన వారు వళ్లీ, దేవసేన, సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారికి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలు, పరిమళ భరిత పుష్పమాలికలను సమర్పించారు. ప్రత్యేక వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకునేలా ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండుగవగా కల్యాణోత్సవం

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ జరిపించారు. కల్యాణానికి ఉభయదారులుగా ఎంపీపీ లతాబాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రాత్రి స్వామివారిని స్కంధ పుష్కరిణిలో తెప్పపై ప్రతిష్ఠించారు. తెప్పపై విహరిస్తూ కటాక్షించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్, రవియాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు.. ప్రాణాంతకం

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు
- దోమ తెర వాడండి.. ఆరోగ్యంగా ఉండండి
- వివిధ వ్యాధుల వ్యాప్తికి దోమే కారణం


దోమకాటుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విజయపురం: ఇటీవల వస్తున్న వ్యాధుల్లో చాలా వరకు దోమకాటుకు సంబంధించినవే. దోమ అత్యంత ప్రమాదకరమైంది. దోమలతో సోకే వ్యాధుల గురించి తెలుసుకుందాం. దోమకాటు చాలా ప్రమాదం. లేనిపోని రోగాలన్నీ దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలిపాయి. పరిశుభ్రత లోపంతోనే దోమలు రోజురోజుకూ వృద్ధి చెందుతూ తమ ఉనికిని చాటుతున్నాయి. హత్యలు, దాడులతో మరణిస్తున్నవారి కంటే దోమలతో వచ్చే వ్యాధుల కారణంగా మరణిస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

వ్యాధులు–లక్షణాలు

మలేరియా: ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడంతో దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది.

లక్షణాలు: చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం విడిచి విడిచి వస్తూ ఉంటుంది.

డెంగీ: పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, ఎముకలు, కండ రాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.

లక్షణాలు: హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతోపాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

మెదడువాపు

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటిస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. లక్షణాలు: ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.

చికున్ గున్యా: ఏడిస్ ఈజిప్ట్ దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు.. కాళ్లలో... కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటారు.

లక్షణాలు: తలనొప్పి, వాంతులు, వికారంతోపాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడ లేకపోవడం.

ఫైలేరియా: దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది. లక్షణాలు: తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు. కాళ్లు, చేతులు, స్తనాలు, వరిబీజం, బుడ్డ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మంచి మార్గం.

దోమతెర: రాత్రిళ్లు పడుకొనే ముందు దోమతెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేటట్లు దుస్తులు వేసుకోవాలి.

వేపనూనె: వేపనూనె, కొబ్బరినూనెను 1:1 నిష్పత్తిలో తీసుకొని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి. వేపలో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ప్రోటోజోల్ గుణాలు ఉన్నాయి.

కాఫీ గ్రౌండ్స్: ఇంటి సమీపంలో నీరు నిలి చిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ డికాషన్ చల్లడం ద్వారా అందులోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోనయి దోమలుగా మారకుండానే నిర్వీర్యమవుతాయి. నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.

నిమ్మనూనె: దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉం డదు. వీటిలో ఉండే సినోల్ రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారిణిగా పనిచేస్తుంది.

కర్పూరం: చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించండి. 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎస్ఆర్‌పేట జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం (1999–2000) పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తర్వాత పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు సుధాకర్, సరోజిని సన్మానించారు. పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.